# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 15 జూన్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 332

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం



**వాతావరణ శాఖ** ముందుగానే హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నం అవుతాయని ఊహించే ఈ నెల 1వ తేదీన నిర్వహించిన సమావేశంలో అప్రమత్తం చేశానని.. అయినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆ రోజు సీనియర్ అధికారులు సహా ఎవరెవరు రోడ్లపైకి వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నారు..? ఎవరెవరు రాలేదన్న దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని.. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తితే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎస్, డీజీపీలకు ఆదేశాలు జారీ చేశారు. అలాంటి సందర్భాల్లో అన్ని ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేయాలని.. మున్సిపల్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలితోపాటు పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని.. అవసరమైతే తాను కూడా వస్తానన్నారు.

# అలసత్వం వహిస్తే... సహించను!

### జూన్ 9న ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వారిపై చర్యలకు ఆదేశం

### మునిసిపల్ ,పోలీస్ అధికారుల మధ్య సమన్వయం లేదు

### ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో అధికారులతో రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష

వర్షాకాల సన్నద్ధతలో యంత్రాంగం వైఫల్యం. అధికారుల నిర్లక్ష్యపు తీరుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో వర్షాకాల సన్నద్ధతపై ఆయన ఉన్నతాధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. జూన్ 9న కురిసిన వర్షానికి సైబరాబాద్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో తలెత్తిన ట్రాఫిక్ జామ్, ప్రజలు పడ్డ ఇబ్బందులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసినా మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది ఎందుకు అప్రమత్తం కాలేదని నిలదీశారు.

హైదరాబాద్, జూన్ 14: తాను జూన్ 1వ తేదీన సమీక్ష నిర్వహించి స్పష్టమైన సూచనలు చేసినప్పటికీ కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల సీరియస్ అయ్యారు. విధుల్లో అలసత్వంగా వ్యవ హరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, మాన వ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితు ల్లోనూ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. వర్షం కు రిసిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీ సులు కూడా క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. పోలీసు తరువాయి 2 వ పేజీలో...



# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

### ఖైరతాబాద్‌లో కార్యకర్తల

విద్యుత్తు, తాగునీటి రంగాల్లో భారాస ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ.. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఖైరతాబాద్‌లో త్వరలో ఉప ఎన్నిక వచ్చే అవకాశం ఉందని, ఆ ఎన్నికలో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులు ఓటరు, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సిటీలో నీళ్లు ఇవ్వలేని ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ ఎలా నిర్మిస్తుందని ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పాలన మొత్తం అవినీతిమయం

హనుమకొండ : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన మొత్తం అవినీతిమయంగా మారిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హనుమకొండలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యకర్తల పిల్లలకు ఉపకార వేతనాలు పంపిణీ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పోలింగ్ ఏజెంట్లకు 'సర్' ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'గురుకుల పాఠశాలలు, సింగరేణి, హ్యామ్ రోడ్ల టెండర్లు మొత్తం అవినీతిమయమే. సింగరేణిలో కేంద్రానికి 49% వాటా ఉంటుంది. అందులో అవినీతి జరిగిందని నేను కిషన్‌రెడ్డికి లేఖ రాస్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లు ఆయన రాష్ట్ర ప్రభుత్వంతో విచారణ చేయమంటున్నారు. మట్టికుప్పలపై బొగ్గు పేరుస్తున్నారని, సాక్ష్యాలతో బయటపెట్టినా కేంద్రం నుంచి స్పందన లేదు. ధాన్యం కొనకముందే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఘనమైన ప్రకటనలు చేసుకుంటున్నారు. భారాస హయాంలో 92 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం. ఇక్కడ మొలకెత్తిన వడ్లు కొనని సీఎం రేవంత్‌రెడ్డి భారాసను మొలకెత్తనీయమంటున్నారు' అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సత్యవతి రాథోడ్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఆరూరి రమేష్ పాల్గొన్నారు.



# సర్‌పై అప్రమత్తత అవసరం



మంచిర్యాల : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) పట్ల కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏ) శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. భాజపా ప్రభుత్వం సర్ పేరుతో ఓటరు జాబితా ప్రక్షాళన చేసేందుకు నిర్ణయించిందని...ఈ ప్రక్రియలో కాంగ్రెస్ ఓటర్ల పేర్లను తొలగించే ప్రమాదం పొంచి ఉందన్నారు. సోషల్ మీడియా పేరుతో భాజపా ప్రభుత్వం ఆధునిక ఏఐ సాంకేతికతను వినియోగించి పేరున్న నాయకుల నియోజకవర్గాల్లో ఓటర్లను భారీగా తొలగించే కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. ఉదాహరణకు తన పేరు గాని, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేరులో చిన్న తప్పు ఉన్నా ఓటరు జాబితాలో పక్కకు పెట్టే అవకాశం ఉందన్నారు. సరైన ధ్రువపత్రాలు సమర్పిస్తే పరిశీలించి జాబితాలో చేర్చుతారన్నారు. ఇలాంటి పరిస్థితిలో సాధారణ పౌరుడు ఓటు కోల్పోతే తిరిగి నమోదు చేసుకునేందుకు కష్టంగా ఉంటుందన్నారు.

ఓటరు జాబితాలో పేరు లేకుంటే దేశ పౌరసత్వం కోల్పోయే ప్రమాదముందని వ్యాఖ్యానించారు. సర్ సర్వే సమయంలో ఇళ్లకు తాళం వేసి ఉంటే జాబితాలో వారి పేర్లు తొలగించేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు ఇంటింటికి తిరిగి ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగించకుండా చూడాలన్నారు. సింగరేణి కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం.. భారాస నేతలు సింగరేణి కార్మికుల శ్రమను, ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడితే క్షమించబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సింగరేణితోనే ముడిపడి ఉందని వ్యాఖ్యానించారు

. ఆదివారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఉపరితల గనిని ఆయన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి, కలెక్టర్ కుమార్ దీపక్, స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి సందర్శించారు. ప్రజా ప్రభుత్వం నిజాలే చెబుతుందని..అందుకే ఈ ఓపెన్ హౌస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థను అన్ని రంగాల్లో కాపాడుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారాస నాయకులు తమ స్వార్థం కోసం కంపెనీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇతర పార్టీ నేతలు సొంత రాజకీయ ప్రయోజనాల కోసం సంస్థను వాడుకోవడం సరికాదన్నారు.

## ఆయుష్మాన్ భారత్ పట్ల గర్విస్తున్నాం



దిల్లీ: దేశంలోని ప్రజలందరికీ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి గత 12 ఏళ్లుగా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఆరోగ్యకరమైన భారత్‌ను నిర్మించేందుకు భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని వెల్లడించారు. బలహీన వర్గాలకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ నిలిచినందుకు గర్విస్తున్నామని పేర్కొన్నారు. 'పీఎం భారతీయ జన్ ఔషధి పరియోజన వంటి ఇతర పథకాలవల్ల ఔషధాలు, స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్లు తక్కువ ధరకే లభిస్తున్నాయి. అదే సమయంలో ఎక్కువ విద్యా సంస్థలు, సీట్లు అందుబాటులోకి రావడంతో అందరికీ వైద్య విద్య అందుతోంది. సంవత్సరాలుగా వైద్య వృత్తిలోకి రావాలనుకున్నవారు తమ సొంత ప్రాంతాలకు సమీపంలోని ప్రవేశాలను పొందుతున్నారు. మెరుగైన చికిత్స, సామాజిక భాగస్వామ్యంతో క్షయ రహిత భారత్‌వైపు దేశం తన ప్రయాణాన్ని వేగవంతం చేసింది. ఒకప్పుడు ప్రధాన ప్రజారోగ్య సవాళ్లుగా నిలిచిన కొన్ని వ్యాధులు క్రమంగా చరిత్రలో కలిసిపోతున్నాయి. ఆరోగ్యకర భారత్‌ను నిర్మించేందుకు ఇప్పటివరకు సాధించిన పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్తాం' అని ఆదివారం 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు.

## మెట్రో రెండో దశకు ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం




అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం మెట్రో రెండో దశకు ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని 50 శాతం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా భాజపా ఎంపీలు రాజీనామా చేయాలని రేవంత్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో రాహుల్, సోనియా, ప్రియాంకాగాంధీలు ఇచ్చిన హామీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు ఓట్లు వేశారని, రెండున్నరేళ్లు గడిచినా వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆదివారం హైదరాబాద్ అంబర్‌పేటలో జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ భాజపా విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం 55 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని, అందుకు నిధులు అందిస్తుందని తెలిపారు. హైదరాబాద్ నగరవాసులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తెలంగాణకు రూ.13 లక్షల కోట్లకు పైగా సహాయం, ప్రాజెక్టులను అందించిందన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందనే అంశంపై రేవంత్‌రెడ్డిని బహిరంగ చర్చకు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించారు. ఇతరుల రాజీనామాలు కోరే రేవంత్‌రెడ్డి ఒక రోజు వర్షానికే నగరంలో ప్రాణనష్టం సంభవించిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. మున్సిపల్ మంత్రిగా వైఫల్యం చెందిన ఆయనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం, భారాస, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని వారిది ఒక్కటే ఎజెండా అని ఆరోపించారు.

# పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం

పురుషులదైనా, మహిళలదైనా క్రికెట్ ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ అంటే ఎప్పుడైనా భారత్‌దే పైచేయి. ఆదివారం బర్మింగ్‌హామ్‌లోనూ అదే జరిగింది. ఆల్‌రౌండ్ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ.. పాక్‌ను చిత్తుగా ఓడించిన హర్మన్‌ప్రీత్ సేన, మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఘనంగా బోణీ కొట్టింది. స్మృతి మంధాన చక్కని బ్యాటింగ్‌తో భారత్ మెరుగైన స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషిస్తే.. దీప్తి శర్మ తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థిని చుట్టేసింది.

మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్ ఆరంభం అదిరింది. గ్రూప్-1 మ్యాచ్‌లో భారత్ 64 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై ఘనవిజయం సాధించింది. స్మృతి మంధాన (68; 44 బంతుల్లో 9ఐ4, 2ఐ6), రిచా ఘోష్ (34; 17 బంతుల్లో 5ఐ4, 1ఐ6) మెరవడంతో మొదట భారత్ 6 వికెట్లకు 170 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36; 35 బంతుల్లో 4ఐ4) రాణించింది. ఛేదనలో పాకిస్థాన్ తేలిపోయింది. దీప్తి శర్మ (5/10), శ్రీచరణి (3/21) ధాటికి 17 ఓవర్లలో 106 పరుగులకే కుప్పకూలింది. మునీబా అలీ (41; 35 బంతుల్లో 5ఐ4) టాప్ స్కోరర్. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. దీప్తికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. భారత్ బుధవారం తన తర్వాతి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో తలపడుతుంది.

పాక్ విలవిల: ఛేదనను పాకిస్థాన్ బాగానే ఆరంభించింది. ఓపెనర్ మునీబా చెలరేగడంతో 4 ఓవర్లలో 37/0తో బలంగా కనిపించింది. కానీ అయిదో ఓవర్లో మరో ఓపెనర్ ఫెరోజా (12)ను దీప్తి ఔట్ చేయడంతో పాక్ కష్టాలు మొదలయ్యాయి. అక్కడి నుంచి ఆ జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పతనం ఏ దశలోనూ ఆగలేదు. వచ్చిన బ్యాటర్ వచ్చినట్లే పెవిలియన్ బాట పట్టారు. దీప్తి తన తర్వాతి ఓవర్లో ఆయేషా (12)ను ఔట్ చేయగా.. ఆ వెంటనే సైరా జబీన్ (2)ను శ్రీచరణి వెనక్కి పంపింది. ఈ ఇద్దరు స్పిన్నర్ల మాయాజాలానికి పాక్ ఉక్కిరిబిక్కిరైంది. ఓ వైపు వికెట్లు పోతున్నా పట్టుదలగా నిలిచిన మునీబా చివరికి 11వ ఓవర్లో రనౌటైంది. ఫాతిమా సనా (0)ను షెఫాలి ఖాతా తెరవనివ్వలేదు. నటాలియా (7), రమీన్ (4)ను శ్రీచరణి తన వరుస ఓవర్లలో వెనక్కి పంపింది. ఆ తర్వాత దీప్తి ఒకే ఓవర్లో (17వ) ఆలియా, తస్మియా, నష్రాలను ఔట్ చేయడంతో పాక్ ఇన్నింగ్స్‌కు తెరపడింది. 31 పరుగులకే ఆ జట్టు ఆఖరి ఏడు వికెట్లు చేజార్చుకుంది.

స్మృతి మొదలెడితే.. రిచా ముగించింది: ఓపెనర్ స్మృతి కీలక ఇన్నింగ్స్, ఆఖర్లో వికెట్‌కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ మెరుపులతో అంతకుముందు టీమ్‌ఇండియా మెరుగైన లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. నిజానికి భారత్ ఆరంభం పేలవం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆ జట్టు.. 18 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. షెఫాలి వర్మ (6), జెమీమా (1) వెనుదిరిగారు. ఆ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌తో కలిసి స్మృతి జట్టును ఆదుకుంది. చక్కని టైమింగ్‌తో షాట్లు ఆడింది. ఎడమచేతి వాటం పేసర్ తస్మియా బౌలింగ్‌లో కొట్టిన సిక్స్ ఆమె ఇన్నింగ్స్‌కే హైలైట్. మరోవైపు హర్మన్ తాను ఎదుర్కొన్న తొలి 22 బంతుల్లో 20 పరుగులే చేసింది. 10 ఓవర్లకు భారత్ 65/2తో నిలిచింది. తర్వాత రమీమ్ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు బాదిన స్మృతి, సైదా వేసిన ఇన్నింగ్స్ 13వ ఓవర్లో సిక్స్ కొట్టింది. స్కోరు 100 దాటింది. కానీ కొద్ది తేడాలో స్మృతి, భార్తీ ఫుల్మాలి (1) ఔటయ్యారు. పరుగుల వేగం తగ్గింది. జట్టు స్కోరు 123 వద్ద హర్మన్‌ప్రీత్ కూడా వెనుదిరిగింది. జట్టు స్కోరు 150 అయినా దాటుతుందా అన్న సందేహం కలిగింది. కానీ ఆఖర్లో రిచా ఘోష్ రెచ్చిపోవడంతో భారత్ అనూహ్యంగా 170కి చేరుకుంది. రిచా జోరుతో ఆఖరి రెండు ఓవర్లలో ఏకంగా 38 పరుగులొచ్చాయి. తస్మియా ఓవర్లో మూడు ఫోర్లు, సిక్స్ బాదిన ఆమె.. ఆఖరి ఓవర్లో మరో ఫోర్ కొట్టి నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లోనూ భారత్, పాక్ క్రికెటర్లు కరచాలనం చేసుకోలేదు.

భారత్ ఇన్నింగ్స్: షెఫాలి (సి) మునీబా (బి) సాదియా 6; స్మృతి (సి) సనా (బి) రమీన్ 68; జెమీమా (సి) నటాలియా (బి) తస్మియా 1; హర్మన్‌ప్రీత్ (సి) నటాలియా (బి) సనా 36; భార్తీ ఫుల్మాలీ (స్టంప్డ్) మునీబ్ (బి) సాదియా 1; రిచా (బి) సనా 34; దీప్తి నాటౌట్ 12; శ్రేయాంక నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 170;
వికెట్ల పతనం: 1-6, 2-18, 3-109, 4-110, 5-123, 6-168;
బౌలింగ్: సాదియా 4-0-41-2; ఫాతిమా సనా 4-0-33-2, తస్మియా 4-0-41-1; రమీన్ 4-0-30-1; నష్రా 4-0-25-0
పాకిస్థాన్ ఇన్నింగ్స్: మునీబా రనౌట్ 41; ఫిరోజా (సి) ఫుల్మాలి (బి) దీప్తి 12; ఆయేషా (సి) స్మృతి (బి) దీప్తి 12; సైరా (సి) హర్మన్‌ప్రీత్ (బి) శ్రీచరణి 2; నటాలియా (సి) హర్మన్‌ప్రీత్ (బి) శ్రీచరణి 7; ఫాతిమా (సి) స్మృతి (బి) షెఫాలి 0; ఆలియా (సి) జెమీమా (బి) దీప్తి 18; రమీన్ (సి) శ్రేయాంక (బి) శ్రీచరణి 4; నష్రా (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 4; తస్మియా (సి) జెమీమా (బి) దీప్తి 0; సాదియా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 5,
మొత్తం: (17 ఓవర్లలో ఆలౌట్) 106;
వికెట్ల పతనం: 1-38, 2-53, 3-58, 4-75, 5-77, 6-79, 7-91, 8-105, 9-105;బౌలింగ్: అరుంధతి 2-0-21-0; శ్రేయాంక 3-0-17-0; క్రాంతి 1-0-14-0; దీప్తి 4-0-10-5; శ్రీచరణి 4-0-21-3; షెఫాలి 3-0-22-1

166మహిళల టీ20 క్రికెట్లో దీప్తి శర్మ వికెట్లు. ఈ ఫార్మాట్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా పుతవాంగ్ (165, థాయ్‌లాండ్) రికార్డును ఆమె బద్దలు కొట్టింది.

బంగ్లా బోణీ బర్మింగ్‌హామ్: బంగ్లాదేశ్ మహిళల టీ20 ప్రపంచకప్‌లో బోణీ కొట్టింది. ఆఖరి ఓవర్లో ఫలితం తేలిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట డచ్ జట్టు 8 వికెట్లకు 139 పరుగులు సాధించింది. బాబెట్ డి లీడ్ (50) మినహా బ్యాటర్లు విఫలమయ్యారు. మారుఫా అక్తర్ (2/31), రితు మోని (1/17), రబేయా ఖాన్ (1/26), సంజిద (1/29) ప్రత్యర్థిని కట్టడి చేశారు. అనంతరం బంగ్లా 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. జౌరియా ఫెర్దౌస్ (50), షర్మిన్ అక్తర్ (37 నాటౌట్), దిలారా అక్తర్ (26) రాణించారు. నెదర్లాండ్స్ బౌలర్లలో డిలాంజ్ (2/27) ఆకట్టుకుంది.

ఛాంపియన్‌కు విండీస్ చెక్ సౌతాంప్టన్: మహిళల టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజిలాండ్‌కు షాక్. ఉత్కంఠ పోరులో షిమైన్ క్యాంప్‌బెల్ (90 నాటౌట్; 62 బంతుల్లో 7ఐ4, 3ఐ6) వీరోచిత ఇన్నింగ్స్ ఆడడంతో వెస్టిండీస్.. న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట కివీస్ 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. బ్రూక్ హాలిడే (40; 32 బంతుల్లో 5ఐ4), ఇసబెల్లా గేజ్ (39; 29 బంతుల్లో 8ఐ4), మ్యాడీ గ్రీన్ (35 నాటౌట్; 22 బంతుల్లో 4ఐ4, 1ఐ6) రాణించారు. విండీస్ బౌలర్లలో ఆలియా అలేన్ (4/27) ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఛేదనలో షిమైన్, హేలీ మ్యాథ్యూస్ (48; 37 బంతుల్లో 6ఐ4, 1ఐ6) జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. హేలీ ఔటయ్యాక కూడా షిమైన్ ఆఖరిదాకా పట్టుదలతో క్రీజులో నిలిచి జట్టును గెలిపించింది. కివీస్ బౌలర్లలో జెస్ కెర్ (2/17) కట్టుదిట్టంగా బౌలింగ్ వేసింది.



# అలసత్వం వహిస్తే సహించను!

మొదటి పేజీ తరువాయి

కమిషనర్ స్థాయి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైకి రావాల్సిందే. అవసరమైతే నేను కూడా రోడ్డుపైకి వస్తాను అని తేల్చిచెప్పారు. జూన్ 9న మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని, ఆ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌లను ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్‌స్పాట్‌లపై ముందుగానే డేటా సిద్ధం చేసుకోవాలన్నారు. వర్షాలకు చెట్లు కూలి విద్యుత్ అంతరాయం ఏర్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఎం.. అవసరమైన చోట మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ విభాగంలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీని ఆదేశించారు.వర్షాకాల సీజన్‌లో అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని, మాన్యువల్ ప్రకారం నిర్వహణ ఉండాలని నీటిపారుదల అధికారులను సీఎం ఆదేశించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని శాఖా కార్యదర్శిని ఆదేశించారు. గేట్ల మరమ్మతులు, నిర్వహణకు వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి సూచించారు. మరోవైపు, వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతు వేదికల ద్వారా విత్తనాలు, యూరియా పంపిణీ చేయాలని, దీనికి స్థానిక వ్యవసాయ అధికారిని, రెవెన్యూ సిబ్బందిని బాధ్యులను చేయాలన్నారు. సన్న వడ్ల కోసం ప్రకటించిన 8 రకాల విత్తనాలపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని జలమండలి అధికారులను సీఎం ఆదేశించారు. నీటి కలుషితం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య ఆరోగ్య శాఖ, శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలన్నారు. మున్సిపల్, జలమండలి, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయ బాధ్యతను ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌కు, అలాగే పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సంస్థల మధ్య సమన్వయ బాధ్యతను డీజీపీకి అప్పగించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# నీస్‌లో కీలక సమావేశాలు

ఆవిష్కరణలు, సాంకేతిక రంగం, తయారీ పరిశ్రమ, అభివృద్ధి చెందుతున్న కొత్త రంగాల్లో భారత్ అందిస్తున్న అవకాశాలను వారికి వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ వేగంగా ఎదుగుతున్న దేశంగా నిలుస్తోందని పేర్కొన్నారు. భారీ వినియోగదారుల మార్కెట్, యువశక్తి, అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాలు దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయని వివరించారు. భారత్ అభివృద్ధి ప్రయాణం ప్రతిభ, విస్తృత స్థాయి, స్థిరత్వం, సంస్కరణలపై ఆధారపడి ఉందని మోదీ తెలిపారు. గత కొన్ని సంవత్సరాల్లో అమలు చేసిన పలు ఆర్థిక, పరిపాలనా సంస్కరణలు పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించా యని చెప్పారు. ప్రపంచంలోని అనేక సంస్థలు ఇప్పుడు భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా చూస్తున్నాయని పేర్కొన్నారు. దీర్ఘకాలిక పెట్టుబడులకు భారత్ అత్యంత అనువైన గమ్యస్థానంగా మారింద న్నారు. ఆవిష్కరణల రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిని కూడా ప్రధాని ప్రస్తావించారు. యువ పారిశ్రామికవేత్తలు, ప్రారంభ సంస్థలు ప్రపంచ స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నాయని తెలిపారు. సాంకేతికత ఆధారిత పరిష్కారా లతో అనేక ప్రపంచ సమస్యలకు భారత యువత సమాధానాలు చూపుతోందని కొనియాడారు. దేశంలో ఏర్పడిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థ అంతర్జాతీయ సంస్థలను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. తయారీ పరిశ్రమ, డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, హరిత ఇంధన రంగాల్లో భారత్‌కు అపార అవకాశాలు ఉన్నాయని ప్రధాని వివరించారు. ఈ రంగాల్లో ప్రపంచ సంస్థలు, పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానిం చారు. పరస్పర సహకారంతో ప్రపంచ స్థాయి పరిష్కారాలు అభివృద్ధి చేయవచ్చని అభిప్రాయపడ్డారు. పెట్టుబడులకు అను కూల విధానాలు కొనసాగుతాయని కూడా హామీ ఇచ్చారు. ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా జరిగిన ఈ సమావేశాలు భారత్--ఫ్రాన్స్ ఆర్థిక సంబంధాలకు కొత్త ఊపునివ్వనున్నాయని భావి స్తున్నారు. పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆవిష్కరణల రంగాల్లో భాగ స్వామ్యం ఏర్పడే అవకాశాలు కనిపి స్తున్నాయి.

# ప్రజాస్వామ్యానికి ఓటే బలం

ప్రక్రి యను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటరు నమోదు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని స్పష్టం చేశారు. దేశ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి ఓటు హక్కే ప్రధాన సాధనమని చెప్పారు. ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తన ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించడం అందరి బాధ్యత అని వివరించారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం వల్ల ఎవరూ తమ రాజ్యాంగబద్ధ హక్కును కోల్పోకూ డదని అన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండటం వల్ల వారికి మరింత బాధ్యత ఉంటుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు, కాలనీలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలిం చాలని సూచించారు. కొత్తగా అర్హత సాధించిన యువతను గుర్తించి వారి పేర్లను నమోదు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. మరణించిన వారు లేదా ఇతర ప్రాంతా లకు శాశ్వతంగా మారిన వారి వివరాలను కూడా సక్రమంగా నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుందని ఆయన హెచ్చరించారు. అందువల్ల ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా ఉంటే ఎన్నికల ప్రక్రియ అంత పారదర్శకంగా ఉంటుందని వివరించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో ఈ ప్రక్రియ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎన్నికల సమయంలో ఒక ఓటు కూడా ఫలి తాలను ప్రభావితం చేసే శక్తిని కలిగి ఉంటుందని గుర్తుచేశారు. అందువల్ల ఓటరు జాబితాలో అర్హుల పేర్లు చేరేలా, అనర్హుల పేర్లు తొలగేలా చర్యలు తీసుకోవాలని బూత్ స్థాయి ప్రతినిధులకు సూచించారు. ప్రజల్లో కూడా ఓటు హక్కుపై అవగాహన పెంచా లని కోరారు. సమావేశంలో పాల్గొన్న బూత్ స్థాయి ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# రామమందిర విరాళాల వివాదం

పూర్తి స్థాయి విచారణ జరపాలనే డిమాండ్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ వివాదానికి సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ చేసిన ఆరోపణలే ప్రధాన కారణంగా మారాయి. సామాజిక మాధ్యమ వేదికలో ఆయన చేసిన వ్యాఖ్యల అనంతరం ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చకు దారితీ సింది. ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత శ్రీరామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్పందించారు. ట్రస్టు కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు అంతర్గత తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం కూడా అదే ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఎలాంటి అక్రమాలకు సంబంధించిన ఆధారాలు లభించలేదని కూడా స్పష్టం చేశారు.² ట్రస్టు వివరణపై ప్రతిపక్షాలతో పాటు కాషాయ శిబిరంలోని కొందరు నాయకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయోధ్యకు చెందిన దంత వైద్యుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు రజనీష్ సింగ్ ఈ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. విరాళాల సేకరణ నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే వరకు మొత్తం ప్రక్రియపై ప్రత్యేక తనిఖీ నిర్వహించాలని ఆయన కోరారు. ట్రస్టు మౌనం ప్రజల్లో అనుమానాలను పెంచుతోందని, అందువల్ల నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ట్రస్టు తో సంబంధం ఉన్న కొందరు మతపెద్దలు తమ సందేహాలను బహిరంగంగా వ్యక్తం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్రస్టు అధ్యక్షుడు మహంత్ నృత్య గోపాల్ దాస్ వారసుడిగా భావిస్తున్న కమల్ నయన్ దాస్ కూడా విచారణ జరగాలని అభిప్రాయపడ్డారు. అదే సమయంలో విచారణ నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యుల తీరుపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. దీంతో వివాదం కేవలం రాజకీయ పరిమితుల్లోనే కాకుండా ఆలయానికి సంబంధించిన వర్గాల్లోనూ చర్చకు కారణమైంది.

# రాహుల్ విమర్శల దుమారం

ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదని ఆయన ఆరోపించారు. దేశ గౌరవానికి సంబంధించిన అంశంలో ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదికలో స్పందించిన రాహుల్ గాంధీ అమెరికా ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టారు. ముగ్గురు భారతీయ నావికులు మరణించి రోజులు గడుస్తున్నప్పటికీ అమెరికా నుంచి కనీసం పశ్చాత్తాప ప్రకటన కూడా రాలేదని అన్నారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేయడంలోనూ అమెరికా విఫలమైందని విమర్శించారు. ఈ ఘటన అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం కలిగిన అంశమైనప్పటికీ అమెరికా వ్యవహరించిన తీరు నిరాశ కలిగిస్తోం దని పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో చేసిన వ్యాఖ్యలపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమెరికా సైన్యం ఆదేశాలను వెంటనే పాటించాలని, ఉల్లంఘనలను సహించబోమని చెప్పడం ఒక స్వతంత్ర దేశానికి ఆదేశాలు జారీ చేసినట్లుగా ఉందని అన్నారు. ప్రపంచంలో గౌరవప్ర దమైన స్థానాన్ని కలిగి ఉన్న భారతదేశం ఇలాంటి వ్యాఖ్యలను సాధారణంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఈ అంశాన్ని గట్టిగా ప్రస్తావించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మౌనంగా ఉండటం దేశ ప్రజలను నిరాశకు గురి చేస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. భారతీయుల ప్రాణాలు కోల్పోయినప్పుడు ప్రభుత్వం అమెరికా ముందు గట్టిగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా మాట్లాడుతూ అమెరికా ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విదేశాంగ శాఖ స్పందన చాలా బలహీనంగా కనిపిస్తోందని అన్నా రు. భారతీయుల ప్రాణనష్టం జరిగినప్పుడు కేవలం ఖండనతో సరిపెట్టకుండా స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరో కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ అమెరికా అధికారుల వ్యాఖ్యలు బెదిరింపు ధోరణిలో ఉన్నాయని ఆరోపించారు. నావికుల మరణానికి బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ అంశం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీయగా, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే తదుపరి స్పందనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ విమర్శలు

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ పాలనను 'అట్టర్ ఫ్లాప్' సినిమాతో పోల్చిన ఆయన, సగం పాలనా కాలం పూర్తయినా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలపై కూడా కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సొంత పార్టీ నాయకులనే వెన్నుపోటు పొడిచే వ్యక్తిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌పై తప్పుడు కేసులు నమోదు చేయించడం వెనుక రాజకీయ కక్షసాధింపే కారణమని పేర్కొన్నారు. తెలంగాణలో జరుగుతున్న అవినీతి, అక్రమాల గురించి పార్టీ అధిష్ఠానానికి చెప్పినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటానని చెప్పడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ హామీల అమలుపై మాట్లాడిన కేటీఆర్, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఎక్కడ అమలయ్యాయో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటివరకు నాలుగు వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరచిపోయి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలకు సంబంధించిన హామీలపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు.



# స్కూళ్లను బలోపేతం చేసే దిశగా...

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే... స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం.

చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు.

ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయబడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# నేటి నుంచి బడిబాట.. సర్వం సిద్ధం!

**వేసవి సెలవుల అనంతరం తెలంగాణలో తెరుచుకోనున్న పాఠశాలలు**

**తొలిరోజు అమావాస్య సెంటిమెంట్, రెండో రోజు మంగళవారం**

**బుధవారం నుంచి పిల్లలను స్కూలుకు పంపే యోచనలో తల్లిదండ్రులు**

**ఎండల తీవ్రతతో బడుల్లో ఓఆర్ఎస్, తాగునీరు తప్పనిసరి చేసిన విద్యాశాఖ**

**విద్యార్థులు వెళ్లే సమయానికి తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు: ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి**



హైదరాబాద్, జూన్ 14: వేసవి సెలవులు ముగియడంతో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు నేటి నుంచి పునఃప్రారంభం కానున్నాయి. షెడ్యూల్ ప్రకారం జూన్ 12నే సెలవులు ముగియాల్సి ఉండగా ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సర్కార్ సెలవులను జూన్ 14 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. దీంతో 2026-27 నూతన విద్యా సంవత్సరానికిగాను సోమవారం ఉదయం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు యథావిధిగా పనిచేయనున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

**వెంటాడుతున్న అమావాస్య సెంటిమెంట్**

పాఠశాలల పునఃప్రారంభానికి యంత్రాంగం సన్నద్ధమైనప్పటికీ, మొదటి రోజే పిల్లలను బడికి పంపే విషయంలో చాలామంది తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం నేడు అమావాస్య కావడమే. జ్యోతిష్య నియమాలు, నమ్మకాల ప్రకారం అమావాస్య రోజున కొత్త పనులు లేదా చదువులు ప్రారంభించడం అరిష్టమన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. అమావాస్య కాదని మరుసటి రోజు పంపుదామంటే మంగళవారం కూడా సెంటిమెంట్ అడ్డొస్తోంది. దీంతో చాలామంది తల్లిదండ్రులు సోమ, మంగళవారాలు కాకుండా నేరుగా బుధవారం నుంచే పిల్లలను స్కూళ్లకు పంపాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**బడుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు..**

సెంటిమెంట్లు ఎలా ఉన్నప్పటికీ, 227 పనిదినాలతో నూతన విద్యా సంవత్సరానికి విద్యార్థులకు స్వాగతం పలికేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతులను సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఎండల తీవ్రత ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో పాఠశాలల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని విద్యాశాఖ అధికారులు యాజమాన్యాలను ఆదేశించారు.

**స్కూళ్ల సమయానికి తగినట్టు బస్సులు**

మరోవైపు, బడికి వెళ్లే విద్యార్థులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులు నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం, సాయంత్రం వేళల్లో కచ్చితమైన సమయపాలన పాటించడంతో పాటు, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు వేయాలని ఎండీ నాగిరెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.



# రేవంత్ పాలనకు ఇక శుభం కార్డే..!

**సొంత పార్టీ నేత మీనాక్షి నటరాజన్‌కే రేవంత్ వెన్నుపోటు**

**అవినీతిపై అధిష్టానానికి సమాచారం ఇచ్చిందన్న కోపంతో బీజేపీకి లీకులు**

**హిట్లర్‌ను ఆదర్శమని సీఎం అనడం ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు**

**ఒక్క ఇటుక వేయలేదు,హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చివేతలు**

**ఖైరతాబాద్ ఉపఎన్నిక తథ్యం.. క్యాడర్ సిద్ధం కావాలి**

**బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ దిశానిర్దేశం**

హైదరాబాద్, జూన్ 14: కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలన అట్టర్ ఫ్లాప్ సినిమాను తలపిస్తోందని, ఇంటర్వెల్‌కే ఈ ప్రభుత్వం ఫ్లాప్ అని తేలిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సగం పాలనా కాలం గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ కక్షపూరిత రాజకీయాలు, వైఫల్యాలపై నిప్పులు చెరిగారు.

**సొంత నేతకే వెన్నుపోటు.. బీజేపీతో కుమ్మక్కు**

రేవంత్ రెడ్డి సొంత పార్టీ నేతలకే వెన్నుపోటు పొడిచే రకమని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్‌లో నిజాయితీపరురాలు, రాహుల్ గాంధీకి నమ్మిన బంటు అయిన మీనాక్షి నటరాజన్‌పై రేవంత్ కుట్ర చేశారన్నారు. రాష్ట్రంలో రేవంత్ చేస్తున్న భూదందాలు, కాంట్రాక్టుల అవినీతిని ఆమె అధిష్టానానికి ఫిర్యాదు చేశారన్న కక్షతో.. హైదరాబాద్‌లో ఆమెపై దొంగ కేసు పెట్టించారని ఆరోపించారు. ఆమెకు సమాచారం లేకుండానే రాజ్యసభకు నామినేషన్ వేయించి, ఆ తర్వాత తాను పెట్టిన దొంగ కేసు వివరాలను బీజేపీకి లీక్ చేసి ఆమెకు పదవి రాకుండా అడ్డుకున్నారని సంచలన ఆరోపణలు చేశారు. సొంత పార్టీ వారికే శఠగోపం పెట్టిన చరిత్ర ఆయనదని విమర్శించారు. ప్రజాస్వామ్య దేశంలో ఉంటూ 'హిట్లర్' తనకు ఆదర్శమని ఒక ముఖ్యమంత్రి చెప్పుకోవడం అత్యంత సిగ్గుచేటన్నారు.

**హామీలు గాలికి.. ఇళ్ల కూల్చివేతలు**

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్న కేటీఆర్.. నిరుద్యోగులకు ఏటా 2 లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల భృతి ఏమయ్యాయని ప్రశ్నించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానన్న హామీ నెరవేరిస్తే తాను రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రభుత్వమే ఒక్కో లబ్ధిదారునికి రూ.1.25 లక్షలు బాకీ ఉందన్నారు. ఇక హైదరాబాద్‌లో పేదల కోసం ఒక్క ఇటుక కూడా వేయని కాంగ్రెస్.. హైడ్రా పేరుతో ఉన్న ఇళ్లను కూల్చివేయడం అత్యంత దుర్మార్గమన్నారు. కేసీఆర్ హయాంలో జీవో 50 ద్వారా పేదలకు పట్టాలిస్తే, రేవంత్ వారిని రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కేసీఆర్ తెచ్చిన పథకాల పేర్లు మార్చడమేనా?**

హైదరాబాద్‌లో 24 గంటల కరెంట్, 20 వేల లీటర్ల ఉచిత తాగునీరు అందించిన ఘనత కేసీఆర్‌దేనని కేటీఆర్ గుర్తు చేశారు. నిజాం తర్వాత 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఆస్పత్రి కట్టలేదని, కేసీఆర్ ఏకంగా నాలుగు టిమ్స్ ఆస్పత్రులు, బస్తీ దవాఖానాలు



తెచ్చారన్నారు. కేవలం ఐదు రూపాయలకే కడుపునిండా భోజనం పెట్టిన అన్నపూర్ణ పథకం పేరును ఇందిరమ్మగా మార్చడం కాంగ్రెస్ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.

**ఖైరతాబాద్ ఉపఎన్నిక ఖాయం**

ఖైరతాబాద్ నియోజకవర్గానికి త్వరలోనే ఉపఎన్నిక రావడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు. దానం నాగేందర్ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరారని, జూబ్లీహిల్స్ తరహాలో దొంగ ఓట్లతో గెలిచేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని హెచ్చరించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటును గమనించాలన్నారు. జూన్ 25 నుంచి జూలై 31 వరకు జరిగే ఎస్ఐఆర్ నమోదు, డిజిటల్ పార్టీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు చురుగ్గా పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, డా. సంజయ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, సీనియర్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# భారత్ శుభారంభం

## మహిళల టీ20 ప్రపంచ కప్‌లో అమ్మాయిలు అదుర్స్

### పాకిస్తాన్‌పై 64 పరుగుల తేడాతో ఘన విజయం.. స్మృతి మంధాన సూపర్ ఇన్నింగ్స్.. దీప్తి శర్మ సంచలన బౌలింగ్

బర్మింగ్‌హామ్, జూన్ 14: మహిళల టీ20 ప్రపంచ కప్‌ను టీమిండియా ఘనంగా ఆరంభించింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తుగా ఓడించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ఆల్‌రౌండ్ షో కనబర్చిన హర్మన్‌ప్రీత్ సేన.. పాక్‌పై 64 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ స్మృతి మంధానా 68 (44 బంతుల్లో 9ఇ4, 2ఇ6), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36), రిచా ఘోష్ (34, 17 బంతల్లో) రాణించడంతో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పపరుగులు చేసింది. అనంతరం పాకిస్తాన్‌ను 106 పరుగులకే కుప్పకూల్చింది. దీప్తి శర్మ (5/10), శ్రీ చరణి 3/21) సంచలన బౌలింగ్‌తో పాకిస్తాన్‌ను దెబ్బకొట్టారు.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 18 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ షెఫాలీ వర్మ (7), జెమీమా రోడ్రిగ్స్ (1) నిరాశపరిచారు.

ఆ తర్వాత స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టును ఆదుకున్నారు. వీళ్లిద్దరూ రెండో వికెట్‌కు 91 పరుగులు జోడించారు. ఈ క్రమంలో స్మృతి 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. ఐతే ధాటిగా ఆడే ప్రయత్నంలో రమీమ్ షహీమ్ బౌలింగ్‌లో ఔటైంది. ఆ వెంటనే భారతీ ఫుల్‌మలి(1), హర్మన్ ఔటవడంతో భారత్ 14 పరుగుల తేడాతో 3 వికెట్లు కోల్పోయింది. చివర్లో రిచా ఘోష్ మెరుపులతో జట్టుకు భారీ స్కోర్ అందించింది.

ఛేజింగ్‌లో పాకిస్తాన్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా దీప్తి శర్మ, శ్రీచరణి పాక్ టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. గుల్ ఫిరోజా (12), అయేషా జాఫర్ (12), సైరా జబీన్ (2), నటాలియా పర్వీజ్ (7) పరుగులకే ఔటవగా.. కెప్టెన్ సనా డకౌట్ అయింది. మునీబా అలీ (41) కాసేపు పోరాడినా.. రనౌట్ గా వెనుదిరిగింది. ఆ తర్వాత ఏదశలోనూ పాకిస్తాన్‌కు భారత బౌలర్లు అవకాశమివ్వలేదు. దీంతో 106 పరుగులకే కుప్పకూలింది.

# ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత్ సంచలనం

### ఒలింపిక్ ఛాంపియన్ కొరియాను ఓడించి పసిడి పట్టిన ధీరజ్-కుంకుమ్ జోడీ!

### నాలుగేళ్ల తర్వాత రికర్వ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్‌కు స్వర్ణం

### 5-1 తేడాతో కొరియాపై ఏకపక్ష విజయం.. వ్యక్తిగత సెమీస్‌లోనూ దూసుకెళ్తున్న ధీరజ్



అంటాల్యా (టర్కీ), జూన్ 14: ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్-3లో భారత ఆర్చర్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహోద్‌ల యువ జోడీ అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్లయిన దక్షిణ కొరియాకు చెందిన బలమైన ఓహ్ యే-జిన్, కిమ్ జె-డివోక్ జంటను భారత జోడీ 5-1 తేడాతో మట్టికరిపించి అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లోని తొలి రెండు రౌండ్లలో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ధీరజ్-కుంకుమ్ జంట వరుసగా 37-36, 37-36 పాయింట్లతో ముందంజ వేసింది. ఇక నిర్ణయాత్మక మూడో రౌండ్‌లో కొరియా ఆర్చర్లు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, ఇరు జట్లు 39-39తో సమంగా నిలిచాయి. దీంతో అంతకుముందు సాధించిన పాయింట్ల ఆధిక్యం ఆధారంగా భారత్ ఘన విజయాన్ని సాధించింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ధీరజ్ - కుంకుమ్ జోడీకి ఇదే మొట్టమొదటి ప్రపంచ కప్ స్వర్ణ పతకం కావడం విశేషం. అంతేకాకుండా, ఆర్చరీ ప్రపంచ కప్ వేదికపై రికర్వ్ మిక్స్‌డ్ విభాగంలో భారత్‌కు ఒక బంగారు పతకం దక్కడం దాదాపు నాలుగేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. చివరిసారిగా 2022లో జరిగిన ఇదే ఈవెంట్‌లో రిధి ఫోర్, తరుణ్‌దీప్ రాయ్ జోడీ భారత్‌కు పసిడి పతకాన్ని అందించింది. కాగా, ఈ టోర్నీలో భారత స్టార్ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర అప్రతిహత ఫామ్‌తో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం గెలిచిన ఆయన, పురుషుల సింగిల్స్ విభాగంలోనూ సెమీఫైనల్‌కు చేరుకు న్నాడు. ఫైనల్లో స్థానం కోసం నేడు జరగబోయే కీలక పోరులో జర్మనీకి చెందిన మారిట్జ్ వీజర్‌తో ధీరజ్ తలపడ నున్నాడు. ఈ మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే ధీరజ్‌కు వ్యక్తిగత విభాగంలో మరో గోల్డ్ లేదా సిల్వర్ మెడల్ ఖాయం కానుంది.

## నెదర్లాండ్స్‌పై బంగ్లాదేశ్ ఘన విజయం

గ్లోబల్ డెస్క్, జూన్ 14: మహిళల టీ20 ప్రపంచ కప్‌లో భాగంగా గ్రూప్--ఎలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో బంగ్లాదేశ్ జట్టు 6 వికెట్ల తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. డచ్ జట్టులో కెప్టెన్ బాబెట్ డి లీడ్ (50; 45 బంతుల్లో 5 ఫోర్లు) అర్ధ సెంచరీతో రాణించగా, హెదర్ సీగర్స్ (16), రోబిన్ రిజ్కే (13), ఐరిస్ జ్విల్లింగ్ (13) పరుగులతో సహకరించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మారుఫా అక్తర్ 2 వికెట్లతో రాణించగా, ఫరిహా త్రిష్ణ, షంజిదా అక్తర్ మేఘ్లా, రబేయా ఖాన్, రితు మోని చెరో వికెట్ పడగొట్టి ప్రత్యర్థిని కట్టడి చేశారు. అనంతరం 140 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఓపెనర్లు జువైరియా ఫెర్దౌస్ (50; 33 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు హాఫ్ సెంచరీతో, దిలారా అక్తర్ (26) బాధ్యతాయుత ఆటతో తొలి వికెట్‌కు 67 పరుగుల శుభారంభాన్ని ఇచ్చారు.



## ఫిఫా ప్రపంచకప్‌లో సంచలనం

## బ్రెజిల్‌ను నిలువరించిన మొరాకో

### సాంబా జట్టు రికార్డుకు బ్రేక్ వేసిన ఆఫ్రికన్ టీమ్

స్పోర్ట్స్ డెస్క్, జూన్ 14: ఫిఫా ప్రపంచకప్ టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన బ్రెజిల్‌కు మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ఊహించని షాక్ తగిలింది. గత ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరి సంచలనం సృష్టించిన ఆఫ్రికా జట్టు మొరాకో, భీకరమైన బ్రెజిల్‌ను 1-1 గోల్స్‌తో నిలువరించి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. గ్రూప్-సిలో భాగంగా జరిగిన ఈ హోరాహోరీ పోరులో, మ్యాచ్ ప్రారంభమైన 21వ నిమిషంలోనే మొరాకో ఆటగాడు ఇస్మాయిల్ సైబారి అద్భుత గోల్‌తో తన జట్టుకు ఊహించని ఆధిక్యాన్ని అందించాడు. అయితే, కంగుతిన్న బ్రెజిల్ కోలుకోవడానికి ఎక్కువ సమయం పట్టలేదు; 32వ నిమిషంలో ఆ జట్టు స్టార్ ప్లేయర్ వినీసియస్ జూనియర్ క్లిష్టమైన కోణం నుంచి గోల్ కొట్టి స్కోరును 1-1తో సమం చేశాడు. ఈ మ్యాచ్‌లో 54 శాతం బంతి నియంత్రణ బ్రెజిల్ వద్దే ఉన్నప్పటికీ, లభించిన 6 కార్నర్లను, ఇతర అవకాశాలను గోల్స్‌గా మలచడంలో విఫలమైంది. స్టార్ స్ట్రైకర్ నెయ్‌మార్ లేకపోవడం బ్రెజిల్ బలహీనతను స్పష్టం చేయగా.. 1934 ప్రపంచకప్ నుండి ఆడిన వరుస 17 ఆరంభ మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తూ వస్తున్న బ్రెజిల్ చారిత్రాత్మక రికార్డుకు మొరాకో ఈ డ్రాతో బ్రేక్ వేసింది. మరో ఆసక్తికర పోరులో, స్కాట్లాండ్ జట్టు 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో చిరస్మరణీయ బోణీ కొట్టింది. తమ తొలి మ్యాచ్‌లోనే బలమైన హైతీ జట్టుపై 1-0 తేడాతో స్కాట్లాండ్ అద్భుత విజయం సాధించింది. మ్యాచ్ 28వ నిమిషంలో స్కాట్లాండ్ కీలక ప్లేయర్ జాన్ మెక్‌గిన్ సమయస్ఫూర్తితో కొట్టిన ఏకైక గోల్ ఆ జట్టును విజేతగా నిలిపింది. చివరిసారిగా 1990 ప్రపంచకప్‌లో స్వీడన్‌పై (2-1) గెలిచిన స్కాట్లాండ్, మళ్లీ ఇన్నాళ్లకు విశ్వవేదికపై విజయాన్ని నమోదు చేయడం విశేషం; అలాగే 1998 తర్వాత ఒక మేజర్ అంతర్జాతీయ ఈవెంట్‌లో ఆ జట్టు గెలవడం కూడా ఇదే తొలిసారి. మ్యాచ్ ముగిసేవరకు హైతీ ఆటగాళ్లు గోల్ కోసం ఏకంగా 13 సార్లు పదేపదే దాడులు చేసినప్పటికీ, స్కాట్లాండ్ డిఫెండర్లు అజేయమైన రక్షణ వలయంతో వారి ప్రయత్నాలన్నింటినీ తిప్పికొట్టి జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని ఖరారు చేశారు.